విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల
ఆదివారం 24 మార్చి 2024 8 పేజీలు

దర్శిలో 'శిద్ధా'కు లైన్ క్లియర్

- జోరుగా ప్రచారం
- శిద్దా ఇంట్లో విషాదంతో ఆగిన ప్రకటన
- రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం
- టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలో దర్శి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేసేందుకు శిద్ధా రాఘవరావుకు లేదా ఆయన కుమారుడు సుధీర్‌కు లైన్ క్లియర్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. శిద్ధా రాఘవరావు సోదరుడు శిద్ధా వెంకటకృష్ణారావు శుక్రవారం రాత్రి అకాల మృతితో శిద్ధా రాఘవరావు టీడీపీలోకి చేరిక ప్రస్తుతానికి వాయిదాపడిందని రెండు రోజుల్లో టీడీపీలో చేరేందుకు లైన్ క్లియర్ అయినట్లు సమాచారం. జిల్లాలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసే ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఇప్పటికే టీడీపీ అధిష్టానం ప్రకటించింది. వారు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి లేదా ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఇరువురిలో ఎవరనేదానిపై సందిగ్ధతలో ఒంగోలు ఎంపీ ప్రకటన వాయిదా పడింది. రెండు రోజుల్లో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిని కూడా ప్రకటించే అవకాశం ఉంది. దీంతో ఒంగోలు ఎంపీతో పాటు దర్శి నియోజకవర్గం తరపున పోటీచేసే అభ్యర్థి పేరు కూడా రెండు ఒకేసారి తెలుగుదేశం పార్టీ ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. దర్శి నుంచి పోటీ చేసేందుకు ఇప్పటికే అనేక మంది ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో గరికపాటి వెంకట్, శ్రీలక్ష్మి, గోరంట్ల రవికుమార్‌తో పాటు వైసీపీకి చెందిన దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్లు కూడా తెరమీదకు వచ్చాయి. అయితే వీరందరిని కాదని శిద్ధా కుటుంబానికి అవకాశం కల్పించేందుకు తెలుగుదేశం అధిష్టానం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో తెలుగుదేశం పార్టీకి శిద్ధా రాఘవరావు విధేయుడు. ఒకసారి ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా ఇచ్చారు. మరోసారి తెలుగుదేశం పార్టీ తరపున ఎంఎల్‌సిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో దర్శి నుంచి శిద్ధా రాఘవరావు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించడంతో చంద్రబాబు నాయుడు తన క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చి ప్రోత్సహించారు. అయితే 2019 ఎన్నికల్లో దర్శి నుంచి పోటీచేసిన శిద్ధా రాఘవరావు ఓటమి మిగతా 2 లో ...

పోటీ చేస్తున్నా ఆశీర్వదించండి

టీడీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయటం ఆనందంగా ఉందని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మతో కలిసి శనివారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు రాష్ట్ర పురోభివృద్ధి చాలా అవసరం అన్నారు. హైదరాబాద్ వంటి మహానగరాన్ని అత్యద్భుతంగా నిర్మించి దేశంలో ప్రధాన నగరంగా నిలిపిన చంద్రబాబు నవ్యాంధ్రను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయగల సామర్థ్యం ఉన్న నాయకుడు అన్నారు. చంద్రబాబు పాలన దక్షత రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. దేశంలో నరేంద్రమోదీ బలమైన శక్తిగా ప్రపంచంలో భారత దేశ ఖ్యాతిని ఔనత్యాన్ని చాటి చెప్పిన గొప్ప ప్రధాన మిగతా 2 లో ...

సింగరకొండ తిరునాళ్లు ప్రారంభం

విశాలాంధ్ర - అద్దంకి : సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. తిరునాళ్ళ ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా శనివారం ఉదయం ధ్వజస్తంభ దాత పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరా రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, మండపారాధన నిర్వహించారు. అనంతరం ధ్వజ పతాక పూజ నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి తిరునాళ్ల ఉత్సవాలన ప్రారంభించారు. వేద పండితులు హరి శంకర అవధాని,ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణ, ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు సాగే ఈ ఉత్సవాలకు సంబంధించిన అన్ని రకాల పనులు పూర్తి చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర తెలిపారు.

అశ్రునయనాలతో...

కీ॥శే॥శ్రీ శిద్ధా వెంకట కృష్ణారావు గారు
మరణం: 22-03-2024, చీమకుర్తి

స్నేహశీలి, మృధుస్వభావి, దానగుణ సంపన్నులు, మంచితనానికి మారుపేరుగా నిలిచి మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా సోదరులు
శ్రీ శిద్ధా వెంకట కృష్ణారావు గారి మరణం మాకు తీరనిలోటు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

సోదరులు: శిద్ధా వెంకటేశ్వరరావు
శిద్ధా నాగేశ్వరరావు
బొమ్మిశెట్టి వెంకటశ్రీనివాసరావు
శిద్ధా పాండురంగారావు
శిద్ధా రాఘవరావు
రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు

శిద్ధా వెంకటేశ్వరరావు, శిద్ధా హనుమంతరావు, శిద్ధా సూర్యప్రకాశరావు

శ్రీ వాసవి గ్రానైట్స్, చీమకుర్తి.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగించాలి

బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర – చీరాల : స్వాతంత్ర సంగ్రామం కోసం తన జీవితాన్ని తృణపాయంగా అర్పించిన భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు ఆశయాల అడుగు జాడల్లో నేటి యువత నడవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్‌కు ఘన నివాళులర్పించారు. శామ్యూల్ మాట్లాడుతూ నేటి యువత భగత్ సింగ్ ఆశయాలు కొనసాగించాలన్నారు.ప్రతి పౌరుడు తమ హక్కులు తెలుసుకొని తమ హక్కులు సాధించు కోవాలన్నారు. ప్రజాస్వామ్య పాలనకు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించు కోవాలని కోరారు.

విప్లవ వీర కిశోరం భగత్ సింగ్

విశాలాంధ్ర – బాపట్ల : విప్లవ వీర కిశోరం భగత్ సింగ్ అని పిన్నవయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరు డయ్యారని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు. భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆయన భారతీయ పౌరుషానికి ప్రతీక అన్నారు.ప్రజలలో తిరుగుబాటు స్పృహను కలిగించారన్నారు. ఆయన రుణం భారతదేశం ఎన్నటికీ తీర్చుకోలేనిదన్నారు. విప్లవ మార్గాన్ని ఎంచుకొని, అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన దేశభక్తి అజరామరమైనదన్నారు. ఆయన సమసమాజాన్ని కాంక్షించా రన్నారు. మత ప్రమేయం లేని దేశం కోసం కలలు కన్నారన్నారు. ఆయన ఆలోచనల నుండి మనమంతా ప్రేరణ పొందాలదన్నారు. భారతదేశ బంగారు భవిష్యత్తు దార్శనికుడు భగత్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమ్రుద్ బాషా, రామకోటేశ్వర రావు, సురేష్,దాసరి లక్ష్మి పాల్గొన్నారు.

దర్శిలో 'శిద్ధా'కు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

చెందారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం దిగిపోయి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. తదనంతరం శిద్ధా రాఘవరావు వ్యాపారాలపై జగన్ ప్రభుత్వం కొరడా ఝుళిపించి వందల కోట్ల రూపాయలు ఫెనాల్టీ రూపంలో చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. లేకుంటే పార్టీలో చేరాలని ప్రతిపాదనలు చేశారు. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో శిద్ధా రాఘవరావు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. అయినా శిద్ధా రాఘవరావుకు స్థాయికి దగ్గ గౌరవం పార్టీలో దక్కలేదు. అయినప్పటికీ ఓర్పు, సహనంతో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోనే గత కొంతకాలంగా కొనసాగుతూ వచ్చారు. చివరిలో దర్శి నుంచి వైసీపీ నుంచి పోటీకి అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరినా నిరాకరించి తన ప్రత్యర్థి అయిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అవకాశం కల్పించారు. దీంతో మనస్తాపానికి గురైన శిద్ధా రాఘవరావు గత కొంతకాలంగా వైసీపీకి కూడా దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో దర్శి నుంచి టీడీపీ తరపున పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి అవకాశం వచ్చింది. రెండు రోజుల్లో తెలుగుదేశం పార్టీలో చేరి దర్శి నుంచి శిద్ధా రాఘవరావు పోటీ చేస్తారని జిల్లా వ్యాప్తంగా ప్రచారం జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో శిద్ధా రాఘవరావు సోదరుడు శుక్రవారం రాత్రి అకాలమృతి చెందడంతో తెలుగుదేశం పార్టీలో శిద్ధా చేరిక వాయిదా పడింది. రెండు రోజుల్లో శిద్ధా టీడీపీలో చేరి దర్శి నుంచి బరిలో దిగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- నియమావళిని ఉల్లంఘించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు
- బల్లికురవ ఎస్సై నాగశివారెడ్డిపై వచ్చిన ఆరోపణపై దర్యాప్తు
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర – బాపట్ల : ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని పోలీస్ అధికారులు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని నియమావళిని ఉల్లంఘించిన పోలీసులను ఉపేక్షించబోమని శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసులను హెచ్చరించారు. శనివారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ పోలీస్ శాఖ అనుసరించవలసిన ఎన్నికల నియమావళి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అనుసరించాలన్నారు.ఎన్నికలలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీస్ శాఖ దీనికి అతీతం కాదని పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వారే మరింత కచ్చితత్వంతో నియమావళిని అనుసరించాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది ఎన్నికల సంఘం నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని అప్పుడే ఇతరులకు కూడా మార్గదర్శకంగా ఉంటామన్నారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిని ఉపేక్షించబోమన్నారు.అటువంటి వారిపై ఎన్నికల సంఘం తీసుకునే చర్యలతో పాటుగా పోలీస్ శాఖపరమైన కఠిన చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పి.నాగశివారెడ్డిపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ కిరాణా షాపులో వ్యక్తి మీద దురుసుగా వ్యవహరించిన విషయంలో ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా రాజకీయ నాయకులు వచ్చి ఎస్సైకు శాలువాను కప్పినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. ఇప్పటికే ఎస్సైకి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. బాపట్ల డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణని ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి విచారణ చేపట్టామన్నారు.విచారణ ముగిసిన అనంతరం విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.క్రమశిక్షణ, నియమ నిబంధనలు ఆచరించే విషయంలో పోలీస్ శాఖ ఇతరులకు ఎప్పుడు మార్గదర్శకంగా ఉండేలాగా చేస్తామని ఎస్పీ తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చండి

ఎమ్మెల్యే కోన రఘుపతికి ఏపీయూడబ్ల్యూజే వినతి

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కారానికి, సంక్షేమానికి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రాంబాబు,జిల్లా కార్యదర్శి గొర్ల శ్రీనివాసరావులు యూనియన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కోన రఘుపతికి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం భగత్ సింగ్ వర్ధంతి,దేశవ్యాప్త జర్నలిస్టుల కోర్కెల దినోత్సవంను పురస్కరించుకుని పట్టణంలోని ఎంఈఓ ఆఫీస్ వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృంద సభ్యులు కలిసి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను,పరిష్కారాలు, సంక్షేమాలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.దేశంలో వర్కింగ్ జర్నలిస్టులు కోరుతున్న విధంగా మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. జర్నలిస్టులు మీడియా సంస్థల భద్రతకు జాతీయస్థాయిలో ఒక చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు.వర్కింగ్ జర్నలిస్టులకు వేతన సవరణ కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సభ్యులు ఉప్పాల శీను,ఉమా,వెంకట్,చంటి,దాసు,లక్ష్మణ్,సురేష్,సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు అడే వంశీ అభినందనలు

విశాలాంధ్ర – బాపట్ల : బాపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థి టి.కృష్ణ ప్రసాద్‌ను శనివారం తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో తెలుగు యువత బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి అడే వంశీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని బాపట్ల ఎంపీ అభ్యర్థిగా రిటైర్డ్ డీజీపీ రావటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం టీడీపీ తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై దాడి

విశాలాంధ్ర – బల్లికురవ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌పై దాడి జరిగిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు బల్లికురవ మండల వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్న సోమవరపాడు గ్రామానికి చెందిన గోపిరాజు యాదవ్‌పై శనివారం వేమవరం నాలుగోర్ల జంక్షన్‌లో కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. గోపిరాజుకు తలకు బలమైన గాయం అవ్వ డంతో అద్దంకి వైద్య శాలకు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు లోని రిమ్స్ హాస్పిటల్‌కి తరలించినట్లు సమాచారం. ఈ దాడిపై పలువురు వైకాపా శ్రేణులు ఇటీవల మేదరమెట్ల వద్ద సిద్ధం సభ నిర్వహించినప్పుడు చంద్రబాబుపై వ్యతిరేకంగా పోస్టులు పెట్టినందుకు టీడీపీ వర్గీయులు దాడి చేసి గాయపరిచారని ఆరోపిస్తున్నారు.ఈ ఘట నపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పర్యావరణ పరిరక్షణే ఏకేయూ ప్రధాన ధ్యేయం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలని ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి అంజిరెడ్డి అన్నారు. శనివారం విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం – పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

పోటీ చేస్తున్నా ఆశీర్వదించండి

(మొదటిపేజీ తరువాయి)

నరేంద్రమోదీ అన్నారు. బీజేపీ,టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలోనే రాష్ట్ర ప్రజలకు అన్నీ విధాలుగా సంక్షేమం అభివృద్ధి సాధించగలరని తెలిపారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని వేమూరు, రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాలను టీడీపీ అభ్యర్థులు గెలవబోతున్నారని తెలిపారు. మంచి నాయకత్వం బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉందని ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. బాపట్ల పార్లమెంట్ స్థానం నుంచి పోటీలో ఉన్న నన్ను ప్రజలు ఆదరించాలని ఎంపీగా గెలిపించాలని కృష్ణప్రసాద్ కోరారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేసే సమయంలో బాపట్ల ప్రాంతం తరుచుగా వస్తుండే వాడినని ఇక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని రాబోవు కాలంలో ఎంపీగా ఎన్నికైతే పార్లమెంట్ ప్రజలకు కావాల్సిన సదుపాయాలను, అవసరతలను తీరుస్తానని హామీ ఇచ్చారు. గెలుపే లక్ష్యంగా పని చేసి అసెంబ్లీ , పార్లమెంట్ స్థానాన్ని బహుమతిగా ఇవ్వబోతున్నామని తెలిపారు. వేగేశన నరేంద్రవర్మ పలువురు నాయకులు పరిచయం చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కృష్ణప్రసాద్‌ను కలిసిన వారిలో జనసేన సమన్వయకర్త నామన శ్రీమన్నారాయణ, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజిని, జీవన్, పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీను, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అడె వంశీ, మందపాటి ఆంధ్రేయ, తానికొండ దయాబాబు, ఝాన్సీరాణి, నజ్మా తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-ఒంగోలు : 65 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత ఒంగోలు నుంచి నెల్లూరుకు తరలిస్తున్న అక్రమ రేషన్ బియ్యం వాహనాన్ని కావలి గ్రామీణ సీఐ కావేటి శ్రీనివాస్ శనివారం పట్టుకున్నారు. జాతీయ రహదారిపై కావలి మండలం గౌరవరం టోల్ ప్లాజా వద్ద ఈ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి రిజిస్టర్డ్ పత్రాలు లేని బొలేరో వాహనంతో పాటు 65 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషనుకు తరలించారు.

ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

విశాలాంధ్ర - బల్లికురవ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో హనుమరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో వాల్ పోస్టర్లు, కటౌట్స్, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేయరాదన్నారు. గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు విగ్రహాలకు ముసుగులు తొడిగి జెండాలు బ్యానర్లు తొలగించామని, ఎక్కడైనా వాల్ పోస్టర్లు జెండాలు రాజకీయ పార్టీలకు చెందిన శిలాఫలకాలు కనిపిస్తూ ఉంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలంతా స్వచ్ఛందంగా వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని అందుకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అధిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పద్మశాలీయులకు ప్రాధాన్యతనివ్వాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్రంలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న పద్మశాలీయులకు ప్రాధాన్యతను ఇవ్వాలని మాజీ కౌన్సిలర్, బీసీ కమిషన్ సభ్యులు అవ్వారు ముసలయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పద్మశాలీయులతో తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పద్మశాలీయుల సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజక వర్గాలలో పద్మ శాలీయులు గెలుపు ఓటములను నిర్ధారించే విధంగా బలం కలిగి ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. రాజకీయాల్లో వారికి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కోరారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఎస్వీఈఈపి ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్ వై.పి.రెడ్డి శనివారం కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నోడల్ ఆఫీసర్ వై.పి.రెడ్డి పాల్గొని ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను తెలిపారు. అనంతరం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ వెంకట్రావు, ఎస్.వి.ఈ.ఈ.పి టీమ్ మెంబర్స్ ఏ.గోపిరెడ్డి, జి.స్వాతిలు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డల భవిష్యత్తు టీడీపీతోనే : ఎమ్మెల్యే స్వామి

విశాలాంధ్ర-పొన్నలూరు : రాబోయే తరాల బిడ్డల భవిష్యత్తు ఒక తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కొండపి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని బోగనంపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు పొన్నగంటి రమణయ్య, మాజీ సర్పంచ్ భర్త ముళ్ళమూరి వెంకట్రావు శుక్రవారం ఎమ్మెల్యే స్వామి, దామచర్ల పూర్ణచంద్రరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమం నేటి వైసిపి ప్రభుత్వం లో జరగటంలేదన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళయన్నారు. రైతులకు ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని 2024 లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తానికొండ మహేంద్ర, స్థానిక నాయకులు దబ్బుకొట్టు వెంకటేశ్వర్లు, పొన్నగంటి సుబ్బారావుతో పాటు యువ నాయకులు ముళ్ళమూరి నితీష్ చౌదరి పాల్గొన్నారు.

బాలబాలికల ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

విశాలాంధ్ర - బాపట్ల : సమగ్ర శిక్ష ప్రత్యేక అవసరాలు గల బాలబాలికల ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం శనివారం నిర్వహించారు. జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎం.వి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అధికారుల నుండి ఈ మెడికల్ క్యాంపు నిర్వహించడానికి ఆగస్టు నెలలోనే ఆదేశాలు జారీ చేసి ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి గ్రాంటు ఇటీవలే విడుదల కావడం వలన శనివారం ఈ శిబిరం నిర్వహిస్తున్నా మన్నారు. మరో వక్త సహిత విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న మాట్లాడుతూ జిల్లాలోని ఒక్కొక్క మండలంలోని భవిత సెంటర్లోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నిమిత్తం క్యాంపును ఏర్పాటు చేసి ఉన్నామన్నారు. వాటికి సంబంధించిన గ్రాంటు ఇటీవలే విడుదల కావడం వల్ల ప్రత్యేక అవసరాలు గల 70 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను నిర్ధారించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ లాస్య, ఆడియో లజిస్ట్ నివేదిత, సైకాలజి నాగ కోటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ ఫిజియోథెరపిస్ట్ శ్రీధర్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు, సిఆర్పిలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని శంకరాపురం పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ పి.ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లా డుతూ ఎవరైనా 50వేల కు మించి నగదు తీసుకు రాకూడదని వాహనదారులకు సూచించారు. అలా ఎవరైనా తరలించాలంటే పోలీసుల దగ్గర అనుమతులు తీసుకోవాలని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించి అన్ని పర్మిట్లు కలిగి ఉండాలని, లేనిచో వారికి జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి అంకమ్మరావు, కానిస్టేబుల్ దాసరి ఏసుబాబు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

16 మంది అరెస్టు, రూ 63,910 నగదు సీజ్

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని 10వ వార్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నజీర్ బేగ్ మాట్లాడుతూ శనివారం ఉదయం పోలీసులకు అందిన సమాచారం మేరకు 10 వార్డులోని ఓ ప్రముఖ వ్యక్తికి చెందిన ఇంట్లో పేకాట శిబిరం నడుస్తోందని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసామని తెలిపారు. పేకాట స్థావరం వద్ద 7 బైక్‌లు, రూ.63910 నగదు, 14ఫోన్లు, 16 మంది పేకాట రాయుళ్ళ ను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. నిషేధిత ఆటలు ఎవరు ఆడిన, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అలాంటి వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. జూదం అడ్డాపై దాడి జరిపినవారిలో రూరల్ సీఐ మల్లిఖార్జున రావు, ఎస్సై హరిబాబు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవదీప్‌కు నష్టపరిహారం చెల్లించాలి

ఏఎన్‌పీఎస్ అధ్యక్షులు చార్వాక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో దళిత విద్యార్థి బొనిగల నవదీప్ కుమార్‌ని కాలేజీలోనే డ్రాయింగ్ మాస్టారు కొత్తమాసు బాలాజీ ఒక రూములో బంధించి రెండు గంటలపాటు విపరీతంగా కొట్టి కులం పేరుతో దూషించి నీకు దిక్కున్న దగ్గర చెప్పుకోమని దౌర్జన్యం చేయడం నీచమైన సంస్కృతి అని అంటరానితనిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చార్వాక తీవ్రంగా ఖండించారు. శనివారం ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతున్న నవదీప్‌ని దళిత నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి రాష్ట్ర వ్యాప్తంగా బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్‌లో జరిగిన సంఘటన దిగ్భ్రాంతి కలిగిస్తుంటే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలేని శ్రీనివాసరావు బాధితుడుని పరామర్శించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. దళితులు కదలే ఎండకు దిక్కే ఉండదన్నట్టుగా ప్రవర్తించడం ఇది చాలా అభ్యం తరకర విషయం అన్నారు. తక్షణమే ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యం నవదీప్ కుమార్ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆ కాలేజీలోనే ఆ విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు నవదీప్‌కి ఎలాంటి ఇబ్బందులు కలిగించ కూడదన్నారు. ఎస్సీ.ఎస్టీ కేసులో యాజమాన్యాన్ని కూడా చేర్చాలని కొత్తమాసు బాలాజీ పై 307 సెక్షన్ క్రింద ఎఫ్ఐఆర్ చేయాలని చార్వాక డిమాండ్ చేశారు. గత దశాబ్ద కాలం నుండి ఇంజనీరింగ్ కాలేజీలో ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్పీ కూడా గతంలో ఇలాంటి సంఘటనలు పైన ఫిర్యాదు చేయగా ముప్పలేని శ్రీనివాసరావు తన రాజకీయ బలంతో వాటన్నిటిని ప్రజలు తెలియకుండా చేస్తున్నాడని ఎప్పటికైనా ఆ కాలేజీ వ్యవహారాలన్నిటిని జిల్లా కలెక్టర్ పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ కాలేజీ దళిత విద్యార్థి కేసులో ఎస్సీ,ఎస్టీ కేసు ఎఫ్ఐఆర్‌లు యాజమాన్యం పేరు లేకపోతే కచ్చితంగా ఆందోళనకు దిగుతామని చార్వాక హెచ్చరించారు. నవదీప్‌ను రామర్శించిన వారిలో సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల చిట్టిబాబు, దళిత గిరిజన రాష్ట్ర నాయకులు మార్పు దీనరాజు,దళిత న్యాయవాదుల ఐక్యవేదిక ప్రతినిధి పోందుగల చైతన్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేక శ్యాం ప్రసాద్,మహిళా నాయకు రాలు దాసరి, లక్ష్మి కుమ్మరి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

శివం నిత్య అన్నదానం నూతన సంచార వాహనం ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు : శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని శివం నిత్య అన్నదాన క్షేత్రంలో నూతన సంచార వాహనం (ఆటో)ను పారిశ్రామికవేత్త మండువ మురళీకృష్ణ ప్రారంభించారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సంఘ సేవకుడు మారెళ్ళ సుబ్బారావు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శివం శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానంతో పాటు వృద్ధులకు పండ్లు కాయలు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ మారెళ్ళ సుబ్బారావు నగరంలో ఎన్నో సమస్యల మీద పోరాడుతున్నారని సేవా కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తున్నారని శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన సంచార వాహనం ప్రారంభించి అన్నార్తులకు నిరంతరం అన్నదానం అందించడం మానవత్వంతో కూడిన పనిఅని తెలిపారు. మండవ సుబ్బారావు. షేక్ మహబూబ్. మండవ లావణ్య. కోసూరి శ్రీదేవి. వడ్డెంపూడి సుజాత నూక తోటి శరత్ బాబు. కొమ్మి రమణయ్య. అడుసుపల్లి వెంకట్రావు. రెడ్ క్రాస్ నరసింహారావు. నేరెళ్ల శ్రీనివాసరావు. సుబ్బు. చౌదరి .మన్నం శేషయ్య. చిక్కాల కిరణ్ కుమార్ శ్రీనివాస్. నాగాంజనేయులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపి తెలిపారు.

సరైన ప్రణాళికతో గెలుపు సాధించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రానున్న ఎన్నికల్లో అధికార వైకాపాను దీటుగా ఎదుర్కునేందుకు తెలుగు దేశం, భాజపా, జనసేన పార్టీలు ఉమ్మడిగా జట్టు కట్టి ఎన్నికలలో నిలిచాయి. అందులో భాగంగా చీరాల అసెంబ్లీ నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా ఉన్న మద్దులూరి మాల కొండయ్యను అభ్యర్థిగా ప్రకటించారు. విజయవాడలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఎన్నికల వ్యూహం అభ్యర్థుల వర్క్ షాప్‌ను తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్వహించారు. ఈ కార్యశాలలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాల ప్రచార అంశాల గురించి వివరించి ప్రతి ఒక్కరూ సరైన ప్రణాళికతో రానున్న ఎన్నికలలో గెలుపొందేలా వాటిని అనుసరించాలన్నారు. ఈ కార్యశాలలో చీరాల నుండి నియోజక వర్గ తెదేపా అభ్యర్థి ఎం.ఎం కొండయ్య, పరిశీలకులు నాతాని ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే పోలీసు కవాతు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఉత్తర్వుల ప్రకారం చీరాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శృంగారపేట,ఆనందపేట,జక్కువారి వీధి, ఐఎల్‌టీడీ మసీద్ సెంటర్, పేరాలలలో రానున్న ఎన్నికల దృష్ట్యా పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల రెండవ పట్టణ సీఐ జి.సోమశేఖర్, ఎస్సైలు మురళి,వెంకటేశ్వర్లు,సిబ్బంది, పోలీస్,పారా మిలిటరీ బలగాలు పాల్గొన్నాయి. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని కంభంపాడు, డీజీపేట, అయ్యలూరివారిపల్లి, రేగులచిలక పంచాయితీల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో కలిసికట్టుగా పార్టీ గెలుపుకు కృషిచేసి వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వ విజయానికి కృషి చేయాలని అన్నారు. అదే విధంగా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తిరిగి ప్రతి ఒక్కరికి అందాలంటే తిరిగి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, జడ్పీటీసీ మేకల శ్రీనివాస్‌యాదవ్, వైసీపీ నాయకులు ముత్యాల నారాయణరెడ్డి, పాలగుళ్ల మల్లికార్జునరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి వెంకయ్య, బి చంద్రశేఖర్, తోట అశోక్, సంగిశెట్టి వాసు, షేక్ ఖాజా, శివారెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు, దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఎం అటిలయ్య, శ్రీనివాసులురెడ్డి, ఖాదర్‌బాషా, పులి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యద్దనపూడి గ్రామంలో శనివారం పర్యటించారు.గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తోటకూర కొండల రాయుడు,మామయ్య బందారుపల్లి వెంకటేశ్వర్లు దశదినకర్మకు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం టీడీపీ నాయకులుతో సమావేశమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికలలో మంచి మెజారిటీ సాధించి మూడవ సారి కూడా ఎమ్మెల్యేగా పర్చూరు నియోజకవర్గంలో నుంచి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, సూరిశెట్టి సతీష్, పి.సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు అన్నారు.యద్దనపూడి మండలంలో చిలుకూరివారి పాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వలసల నివారించేందుకే ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.ఈ అవకాశాన్ని కూలీలు సద్వినియోగం చేసుకొనేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలంలోని స్వామిత్వ జరుగుచున్న గ్రామాల పంచాయతీ కార్యదర్శులను స్వామిత్వ సర్వే ప్రొగ్రెస్‌ను పరిశీలించినారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ కమిషనర్ ఏ.సిరి,ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం,వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మేమున్నాం స్వేచ్ఛగా ఓటేయండి

పామూరు సీఐ రామానాయక్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎన్నికలు జరుపుకునేందుకు ప్రజలు సహకరించాలని పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం రామానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన సీఎస్‌పురం పట్టణంలో ప్రధాన వీధుల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి సీఐ రామా నాయక్ మాట్లాడుతూ ప్రశాంత వాతా వరణంలో ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా నచ్చిన పార్టీకి ఓటు వేసుకోవచ్చని కోరారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అనవసరపు ద్వేషాలకు పోయి కేసులుపెట్టి కోర్టులచుట్టు తిరగవద్దని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటివారైన ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే పామూరు సర్కిల్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్‌ఐలు బి ప్రేమ్‌కుమార్, శివ, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని విజయ లక్ష్మి పురంలోని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో అమరవీరుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్ర పటాలకు మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. తాండ్ర సాంబ శివరావు మాట్లాడుతూ 23 మార్చ్ 1931 వ తేదీన అప్పటి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్‌లను ఉరి తీసిన రోజును దేశ వ్యాప్తంగా అమరవీరుల దినోత్సవంగా జరుపు కుంటున్న మన్నారు. మాజీ సైనికుల ఆధ్వర్యంలో అమర వీరులకు నివాళులు అర్పించు కోవటం సంతోషదాయకం అన్నారు. దేశం కోసం ఉరి తాడును సైతం ముద్దాడి వీర మరణం పొందిన భగత్ సింగ్ లాంటి అమరుల త్యాగాలను స్మరించుకొని భారత దేశ అభివృద్ధికి ప్రతి భారతీయుడు తోడ్పడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు,సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గా రావు,సిహెచ్ కృష్ణా రావు,అబ్దుల్ రజాక్, పసుపులేటి ప్రసాద్, పి.రాధాకృష్ణ మూర్తి, కే.ఆంజ నేయులు, డి.వెంకటేశ్వర్లు, ఈపూరి చంద్ర మోహన్, ఎస్విబి శ్రీనివాసరావు,కర్రీ సుబ్బారావు తదితర మాజీ సైనికులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్

దేవండ్ల శ్రీనివాస్

విశాలాంధ్ర - యర్రగొండపాలెం : భగత్ సింగ్ స్వాతంత్ర సమరయోధుడు, విప్లవకారుడని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ న్యూఢిల్లీలోని సెంట్రల్ అసెంబ్లీలో బాంబులు విసిరి కరపత్రాలు వెదజల్లారని, విప్లవం వర్ధిల్లాలి, శ్రామికవర్గం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారని అన్నారు. ప్రజా భద్రతా చట్టం కార్మిక వివాదాల చట్టం పేరుతో సెంట్రల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక నిర్బంధ చట్టాలను నిరసిస్తూ 31మంది కార్మిక నాయకుల అరెస్టును ఖండిస్తూ వారు ఆచర్యకు పూనుకున్నారన్నారు. ఉద్దేశ పూర్వకంగానే పేలుడు సామర్థ్యం తక్కువ ఉన్న బాంబులను వారు విసిరారన్నారు. సెంట్రల్ అసెంబ్లీలో సభ్యులు కూర్చున్న బెంచ్‌ల వైపు కాకుండా కావాలని కాళీ బెంచ్‌ల వైపు బాంబులను వేశారన్నారు. అక్కడ గందరగోళంలో తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ భగత్‌సింగ్, బటుకేశ్వర్ దత్ తప్పించుకోకుండా అక్కడే నిలబడిపోయారన్నారు. పోలీసుల దగ్గరికి వెళ్లి స్వయంగా లొంగిపోయారన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ ఇది పిరికిపంద చర్య నేను స్వాతంత్రం కోసం పోరాటం చేస్తూ ప్రాణాలు విడిచే దానికి సిద్ధంగా ఉన్న, నా ప్రాణాలు సమర్పణతోనైనా భారతదేశ యువతలో చైతన్యం కలిగి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల మీద పోరాటం ఉధృతం చేసి స్వాతంత్రాన్ని సంపాదించుకునే అవకాశం వస్తుంద న్నారు. స్వాతంత్ర్యం అనం తరం భారతదేశాన్ని చూడ టానికి వీలుగా నా కంటి గుడ్లను ఒక అందుడికి ఉపయోగించండి అన్నారు. తద్వారా భారత స్వాతంత్రదేశాన్ని చూడగలుగు తానని విన్నవించిన వ్యక్తి భగత్‌సింగ్ అని అన్నారు. విప్లవకారుడు, కమ్యూనిస్టుగా మారి 1931 మార్చి 23న ఆయన ఉరి తీయబడ్డాడు. అయితే ఆయన కోరిన స్వాతంత్రం రాలేదన్నారు. అమరవీరులు ఆశించిన స్వాతంత్రం భారత దేశంలో లేదన్నారు. సామ్రాజ్యవాదుల చేతిలో కీలుబొమ్మలై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరి స్తున్న విధానాలు మంచివి కాదన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత ఆ స్వాతంత్ర ఫలాలను ప్రజలకు అందించే కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ నాయకులు సాంబయ్య, వెంకట శివయ్య, యోగయ్య పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొమరోలు : మండలంలోని పుల్లారెడ్డిపల్లి పంచాయతీ గోహరపల్లి గ్రామవాసి నిరుపేద కుటుంబానికి చెందిన ఎదురు పెద్దపుల్లయ్యకు గత సంవత్సరం పక్షవాతం వచ్చి అనారోగ్యంతో హాస్పిటల్‌కి వెళ్లలేని స్థితిలో ఉన్నాడు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి వారిది. నిరుపేద కుటుంబంగా గుర్తించి వారికి ఆర్థిక సహాయం చేయమని అమ్మ ఫౌండేషన్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. వారికి అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ కుటుంబసభ్యుల సహకారంతో ఖర్చుల నిమిత్తం రూ.5000 గ్రామస్తుల సమక్షంలో అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ బోనేని వేంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేసిన ముత్తముల సంజీవరెడ్డి చేతులమీదుగా అందచేశారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులు అమ్మ ఫౌండేషన్ చేస్తున్నా సేవాకార్యక్రమాలు మరువలేనివని, అమ్మ ఫౌండేషన్ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ జనరల్ సెక్రటరీ పందన బోయిన భూపాల్, కోశాధికారి సుధాకర్ యాదవ్, సభ్యులు వెంకట రామిరెడ్డి, షేక్ నబీ, బిజ్జాల తిరుమల రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో ఫ్లాగ్ మార్చ్

విశాలాంధ్ర - టంగుటూరు : మండలంలోని పొందూరు గ్రామంలో సింగరాయకొండ సీఐ డి. రంగనాథ్ ఆధ్వర్యంలో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని ముఖ్యమైన వీధులలో కేంద్ర పోలీసు బలగాలు , సివిల్ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రంగనాథ్ మాట్లాడుతూ ఎన్నికల్లో నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటలో పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని భరోసా కలిగించేందుకు ఈఫ్లాగ్‌మార్చి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ఎలాంటి ప్రలోభా లకు లోను కాకుండా నిర్భయంగా ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా సాఫీగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పోలీసు బలగాలు, టంగుటూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతంలో ఎన్నికల కోడ్ లేదా?

విశాలాంధ్ర - త్రిపురాంతకం : పోలింగ్ పరిసర ప్రాంతాల్లో ఎన్నిక కోడ్ లేదు అన్నవిధంగా త్రిపురాంతకం ఎన్నికల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల కోడ్ లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, రాజకీయ నాయకుల విగ్రహాలు, జండాలు తొలగించాలి. అయితే అవి తొలగించాల్సిన అధికారులు తమకు ఏమి పట్టదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. త్రిపురాంతకం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రం 129 ప్రక్కనే పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభ శిలాఫలకం ఉంది. ఈ శిలా ఫలకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చిత్రపటాలు కనిపిస్తున్నాయి. అయితే పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులకు పకన్నే వున్న శిలా పకలం గుర్తించలేని పరిస్థితులలో అధికారులు వుండటం గమనార్హం. కేవలం ఎన్నికల కమీషన్ ఇస్తున్న ఆదేశాలను పాటించడంలో వీరి తీరు అర్థం అవుతుంది. శిలా ఫలకాలు తీసివేయడం త్రిపురాంతకం మండల ఎన్నికల అధికారులకు ఇష్టం లేదు అన్న విధంగా వ్యవహారం వుందనీ తెలుస్తుంది.

విద్యార్థిపై ఇన్విజిలేటర్ చేయి చేసుకున్నది అవాస్తవం

విశాలాంధ్ర-పామూరు : పదోతరగతి పరీక్ష సెంటర్‌లో విద్యార్థిపై ఇన్విజిలేటర్ చేయి చేసున్నారని ఒక పత్రికలో వచ్చిన వార్త ఊహ జనితమని, అలాంటి సంఘటన జరగలేదని మండల విద్యాధికారి డీవీ సుబ్బారావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష సెంటర్‌లో లెక్కల పరీక్ష జరుగుతుండగా రూమ్‌నెంబర్ 4లో ఇన్విజిలేటర్ విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు పత్రికలో రావడం చూసి శనివారం సెంటర్‌ను సందర్శించి జరిగిన సంఘటనపై ఆ విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి విచారించామని, మా పిల్లవాడిపై ఏ ఇన్విజిలేటర్ చెయ్యి చేసుకోలేదని, ఏ అధికారికి ఫిర్యా దు చేయలేదని లిఖితపూర్వకముగా రాసి ఇచ్చి నట్లు తెలిపారు. ఆ విద్యార్థి చదువుతున్న పాఠశాల యాజమాన్యాన్ని విచారించగా వారుకూడా పత్రికలో వార్త రావడం చూసి ఆశ్చర్యానికి గురయ్యామని తెలిపినట్లు సుబ్బారావు పేర్కొన్నారు.

టీడీపీ ఎన్నికల వ్యూహం వర్క్‌షాప్‌లో జిల్లా నేతలు

విశాలాంధ్ర - ఒంగోలు : విజయవాడ ఎ1 కన్వెన్షన్ సెం టర్‌లో టీడీపీ జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబు నాయు డు ఆధ్వర్యంలో ఎన్నికల వ్యూహం వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, టీడీపీ, జనసేన ఒంగోలు నియోజక వర్గం అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, సంతనూతలపాడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్ విజయ్‌కుమార్, టీడీపీ చీరాల అభ్యర్థి ఎంఎం కొండయ్య యాదవ్, దర్శి నియోజక వర్గం ఇన్‌చార్జ్ గోరంట్ల రవికుమార్, యర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనర శింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, అబ్జర్వర్ పాపారావు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తీసుకోవాలి

విశాలాంధ్ర - పర్చూరు : సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు అనుమతులు తీసుకోవాలని బాపట్ల ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సభలు, ర్యాలీలు, సమావేశాలు, కార్యాలయాల ప్రారంభాలకు అనుమతి తీసు కోవాలని సూచించారు. సువిధ యాప్ ద్వారాగాని, ఆర్ఓ కార్యాలయంలో గాని దరఖాస్తులు అందించాలని, పరిశీలించి సింగిల్ విండో విధానంలో 24 గంటలలో అనుమతి మంజూరు చేస్తామని తెలిపారు. పార్టీలు సమస్యలు తలెత్తకుండ ఎన్నికలు నిర్వహించటానికి తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో ఏఈఆర్ఓలు సుబ్బయ్య, ప్రమీల, సంధ్యశ్రీ, నాగరాజు, మెహర్‌కుమార్, ఫణీంద్రబాబు, ఎంపిడిఓలు నితిన్, శ్రీదేవి, శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్ ఉన్నారు.

సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి

విశాలాంధ్ర - త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి డి శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ నెంబర్ చల్ల యల్ల రెడ్డి భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను పాటించాలని సూచించారు. స్వాతంత్ర్యం రావడంతో కీలక పాత్ర పోషించిన నాయకుడు భగత్ సింగ్ అన్నారు. అతి చిన్న వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, యోగయ్య,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రం అల్లూరయ్యకు మాగుంట నివాళి

విశాలాంధ్ర - కొమరోలు : గిద్దలూరు మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం అల్లూరయ్య అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మాగుంట రాఘవరెడ్డి కొమరోలు మండలం గోపాలుని పల్లె గ్రామంలోని గుర్రం అల్లూ రయ్య స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుర్రం అల్లూరయ్య మృతి టీడీపీకి తీరని లోటని ఆయన అన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దనే పోలింగ్‌పై అవగాహన

విశాలాంధ్ర - కొనకనమిట్ల : మే నెలలో జరగనున్న అసెంబ్లీ లోకసభ ఎన్నికల్లో 80సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులు వారి ఇంటి నుంచే ఓటు వేసుకునే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. ముందస్తుగా మండల కేంద్రమైన కొనకనమిట్లలో వృద్ధుల ఇంటి వద్దనే ఓటు వేసే విధానాన్ని శనివారం మండల స్థాయి అధికారులు ఎంపీడీవో సుగుణమ్మ తహశీల్దార్ ఎస్ కే సాజిదాహోమ్ టీం సభ్యులు బీఎల్వోలు అవగాహన కల్పించారు. బ్యాలెట్ పై ఓటు వేసే విధానాన్ని వారికి చూపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వికలాంగులు, వయోవృద్ధులు పోలింగ్ కేంద్రాలకు రాలేరు కాబట్టి వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించిందని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్ టీం సభ్యులు పివి రమణయ్య, చలపతి, బిఎల్వోలు రాజకుమారి, ఉడుముల శ్రీనివాసులురెడ్డి, బూదాల కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కనిగిరి : గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారరని ఐసీడీఎస్ కనిగిరి ప్రాజెక్టు సీడీపీఓ సరోజినీ అన్నారు. శనివారం కనిగిరి మండలం మాచవరం సెక్టర్‌లోని చాకిరాల అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రంలోని గర్భవతులు బాలింతలకు చిరున ధాన్యాలు తినటం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు గర్భవతులకు ఇచ్చే వైయస్సార్ సంపూర్ణ పోషణ గురించి వివరించారు. చిన్నారులకు విధిగా ప్రతిరోజు బాలామృతం తినిపిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎత్తుకు తగ్గ బరువు పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ మల్లేశ్వరి, మాచవరం పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయాలు పాల్గొన్నారు.

మంత్రి సురేష్, వైసీపీ నేత బాలినేనిలను కలిసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ షంషీర్ ఆలీ బేగ్

విశాలాంధ్ర-మార్కాపురం : ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బేగ్ శనివారం ఒంగోలులో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైసీపీ నాయకులు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిను కలసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ డాక్టర్ షంషీర్ అలీ బేగ్‌ను మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేనిలు అభినందించారు. మైనారిటీల సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడాలని వారి సందర్భంగా డాక్టర్ మీర్జా అలీ బేగ్ ను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, బీసీ బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీఎల్‌పీ యాదవ్, మాజీ జడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి, పార్టీ నాయకులు బట్టగిరి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సన్నద్ధం కావాలి

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి

విశాలాంధ్ర - ఒంగోలు : భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల త్యాగాల స్ఫూర్తితో దేశాన్ని మతోన్మాద బీజేపీ కబంధహస్తాల నుంచి రక్షించుకునేందుకు ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సన్నద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమితి పిలుపులో భాగంగా శనివారం ఒంగోలులోని ప్రెస్ క్లబ్‌లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ల వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రాజశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు లెనిన్, ఐద్వా జిల్లా నాయకురాలు కంకణాల రమాదేవి అధ్యక్షత వ్యవహరించారు. కార్యక్రమానికి ముందుగా భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఎన్ని బాధలు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ దేశ ప్రజల ఆత్మగౌరవం ప్రతీకగా 1920లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో బ్రిటిష్ పాలకులు జరిపిన లాఠీచార్జీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనగలాన్ని వినిపించాలనే లక్ష్యంతో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు పొగ బాంబ్ విసిరి అరెస్టు అయ్యారు. బ్రిటిష్ కోర్టులను దేశ ప్రజల స్వతంత్ర గళాన్ని వినిపించేందుకు వినియోగించుకున్నారన్నారు. దేశ స్వతంత్ర కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన వీరులన్నారు. రెండేళ్ల జైలు జీవిత కాలంలో మార్క్స్ రచించిన పుస్తకాలను అభ్యసించి స్వతంత్ర భారతదేశానికి మార్క్స్ చూపిన మార్గమే దిక్కని ఒక పూర్తి స్థాయి అవగాహనకు వచ్చారన్నారు. భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురుల స్ఫూర్తితో దేశంలోని రైతాంగం ఐక్యతతో ఢిల్లీ నడిబొడ్డున పెట్టుబడిదారుల, కార్పొరేట్ శక్తుల పక్షపాతి మతోన్మాద బీజేపీనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడుపుతున్న జాతీయ రైతు నాయకులకు, కార్మిక సంఘాల నేతలకు వినమ్రతతో అభినందనలు తెలుపుతున్నామన్నారు. దేశంలో లౌకికత్వం, ప్రజాస్వామ్యంతో పాటుగా స్త్రీమూర్తులను రక్షించుకోవాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో మతోన్మాద బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వీరారెడ్డి మాట్లాడుతూ రైతాంగ ఉద్యమంలో అసువులు బాసిన వారికి జోహార్లు అర్పించారు. దేశంలోని సహజ సంపదను, కార్మిక శక్తిని, రైతన్నల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బిజెపిని వచ్చే ఎన్నికలలో తరిమి కొట్టాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ నేటి యువతకు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వంటి త్యాగధనుల, స్ఫూర్తిదాతల చరిత్ర తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభివృద్ధి ద్రోహులు, దేశ స్వతంత్రంలో ఎటువంటి ప్రమే యం లేని, రైతాగా ద్రోహులు, కార్మిక ద్రోహులు బిజెపిని వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఏపీ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లం రెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావాలి సుధాకర్ రావు, ఏఐకెకెఎస్ జిల్లా కన్వీనర్ భీమవరపు సుబ్బారావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు సర్దార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పివిఆర్ చౌదరి, ఐఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు సుందరం, భారతీయ కిసాన్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లపోలు నాగ మనోహర్ లోహియా, ఏఐటీయూసీ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకోటయ్య, ఎస్ కే బాబు, ఏపీ రైతు సంఘం నాయకులు జయంతి బాబు, కేవిఎన్‌టిఎస్ నాయ కులు జార్జ్, అరుణోదయ జాలన్న, సీఐటీయూ నాయకులు మహేష్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఆర్ మోహన్ మాట్లాడారు.

భగత్ సింగ్ ఆశయాలు కొనసాగించాలి

విశాలాంధ్ర - కనిగిరి : స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక దర్శి చెంచయ్య భవనంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.పవన్ కళ్యాణ్ ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా సుబ్బారావు మాట్లాడుతూ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారంకోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కోసం అనేకమంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసుకున్నారు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ రాజకీయ స్వలాభం కోసం కులాలకు, మతాలకు మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను సైతం ప్రైవేట్‌పరం చేస్తూ యువత శ్రమను కార్పొరేట్ రంగాలకు కట్ట బెట్టి పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా జర పాలని, భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పవన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ సురేష్, షేక్ ఖాశింవలి ఏఐటీయూసీ నాయకులు పవన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల తీరుపై నాయకులకు అవగాహన

విశాలాంధ్ర - త్రిపురాంతకం : మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులకు మండల ఎంసీసీ అధికారి మురళీ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ పార్టీ జండాలు,గోడ పత్రాలు ఎక్కడైనా ఉంటే ఒకరివి మరొకరు తీసివేయకుండా జాగ్రతలు తీసుకోవాలని అన్నారు. అలాచేస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన చట్టం క్రింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ సాంబ శివరావు, యస్ఐ సాంబ శివయ్య, వైసీపీ నాయకులు పోలిరెడ్డి, యల్లారెడ్డి, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర- చీమకుర్తి : చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ అధికారులను అడిగితే పన్నులు వసూలు చేసి జీతాలు చెల్లిస్తామని చెబుతున్నారని, నెల జీతం వస్తేనే కార్మికులకు పోషణ జరుగుతుందన్నారు. అధికారులు జోక్యం చేసుకుని వారి జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - చీమకుర్తి : సంతనూతలపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జునని, వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించిన చీమకుర్తి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌరులకు అందుబాటులో సీ-విజిల్ యాప్

విశాలాంధ్ర - కనిగిరి : అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు మా ఇష్టం, మమ్మల్ని ఎవరు ఏం చేస్తారు. మనకు అనుమతులు అవసరమా అంటూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా అదే పంథాలు కొనసాగుతున్నారు. అనుమతులు లేకుండానే సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల తాయిలాలు ఇవ్వటం చేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందులో సామాన్యులకు సైతం భాగస్వాములు చేస్తుంది. సి విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పిస్తుంది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై అధికారులు చర్యలు తీసుకునేలా సివిజల్ యాప్ సహకరించనుంది.

సివిజిల్ యాప్ :- ఈ యాప్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఈ సివిజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనపై సాక్ష్యాలతో సహ అందులో పొందుపరచవచ్చు. ఫోటో లేదా వీడియో ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్ లో అప్లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. విచారణ చేపట్టి వంద నిమిషాల్లో ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు.

యాప్ డౌన్లోడ్ ఇలా : గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వారి సివిజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. మీ మొబైల్ నెంబర్ ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోగానే ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే సివిజిల్ యాప్ సిద్ధం. దాని ద్వారా ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు అధికారులు గోప్యంగా ఉంచుతారు.

వీటిపై ఫిర్యాదు చేయాలి : ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనయిన అయితే ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితబహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయటం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం ఇలాంటి ఉల్లంఘనలు ఫోటో లేదా వీడియో, ఆడియో చేసి అప్లోడ్ చేయాలి.

ఫిర్యాదు ఎలా చేయాలంటే : సివిజిల్ యాప్ తెరవగానే ఫోటో , వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. మీరు ఫోటో ద్వారా ఫిర్యాదు చేయాలంటే ఫోటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదు అవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫోటో అప్లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం ఏ నియోజకవర్గ తదితర వివరాలు నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను సంబంధించిన ఫోటో అప్లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి.ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

ఐదు నిమిషాల్లో రంగంలోకి : యాప్ వివరాలు పొందుపరచగానే జిల్లా అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు . ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా ఫిర్యాదు పై 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకొని అవకాశం ఉంటుంది.

పౌరులు అడ్డుకట్ట వేయాలి : తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికారం పీఠం ఎక్కాలి అనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. ఈరోజే యాప్ డౌన్లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమా లకు అడ్డుకట్ట వెయ్యండి. రాష్ట్ర దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలి.

కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా బలహీన పరిచేందుకు బీజేపీ కుట్ర

విశాలాంధ్ర - యర్రగొండపాలెం : లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఆటంకం కలిగిస్తూ కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను బీజేపీ నేతృత్వంలోని కేంద్రం స్తంభింపజేస్తోందని ఇది భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రధాని మోదీ, అమిత్ షాల 'నేరపూరిత చర్య' అని ఏపీసీసీ సభ్యులు యర్రగొండపాలెం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలన్నిటిని 10 సంవత్సరాల బిజెపి పాలనలో ధ్వంసం అయ్యాయని ప్రజాస్వామ్య బద్ధంగా కాంగ్రెస్ ని ఎదుర్కోలేకనే బిజెపి, మోదీ కుయుక్తులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు పారిశ్రామికవేత్తల్ని, కాంట్రాక్టర్లను సీబీఐ, ఈడి ఇన్కమ్ టాక్స్ రైడ్లు చేయించి భయభ్రాంతుల్ని చేసి ఎలక్ట్రికల్ బాండ్స్ ముసుగులో వేల కోట్లను దండుకున్నది బీజేపీ మోడీయేనని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మోడీ, బీజేపీ ఓడిపోతుందనే భయంతోటి ఇలాంటి చౌకబారు చర్యలకు పాల్పడుతుంది అని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ కూటమికి 150 సీట్లు కూడా రావని రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - సీఎస్‌పురం : కనిగిరి టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శనివారం విజయవాడలోని శ్రీబాలాజీ హోటల్ నందు జరిగింది. ఈ సమావేశానికి కనిగిరి నియోజకవర్గంకు చెందిన టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ సమావేశంలో డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కనిగిరి టీడీపీ అభ్యర్థిగా తనకు ఈ ప్రాంత వాసులు సహకరించి గెలుపుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రం భవిష్యత్తుచంద్రబాబు వస్తేనేనని, లేదంటే రాష్ట్రం సర్వనాశనమై పోతుందని ఆయన విమర్శించారు. రేపు జరగబోయే ఎన్నికల్లో తన విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథ రాములు, నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, టీడీపీ నాయకులు చెంచురామయ్య, నరేంద్ర, జి సుబ్బారావు, శ్రీనివాసులు, నారాయణ, ఆర్ నారాయణ, కంభాలదిన్నె మాజీ సర్పంచి మాల్యాద్రి, మహేశ్వరరావు, మధుసూదన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించండి

విశాలాంధ్ర - మార్కాపురం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ, మే 13వ తేదీ పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని సిఐ ఆవుల వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి పరిశీలించేందుకు, అలాగే ఓటర్లను చైతన్య పరచేందుకు తన సిబ్బందితో కలిసి సీఐ ఆవుల వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం మండలంలోని ఎల్ బి ఎస్ నగర్, తిప్పాయపాలెం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ అత్యంత సహజమని, కావున ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఓటర్లను ప్రలోభ పరచేందుకు డబ్బులు, మద్యం అశ చూపితే అటువంటి వారి గురించి,వారు వ్యక్తులైన లేక రాజకీయ పార్టీలైన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్‌లు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఐ కిడ్స్ పాఠశాలలో హోలీ వేడుకలు

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి పట్టణంలోని ఐ కిడ్స్ పాఠశాలలో శనివారం ముందస్తు హోళి వేడుకలు పాఠశాల ప్రిన్సిపల్ షరీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ చిన్నారులకు పండుగ ప్రాముఖ్యత వివరించారు. తప్పిదాలకు స్వస్తి చెప్పడానికి మరియు వదిలించుకోవడానికి, ఇతరులను కలవడం ద్వారా విభేదాలను ముగించడానికి, మరచిపోవడానికి, క్షమించడానికి ఇది పండుగ రోజు అని సేవా భావరో మెలగాలని, ఇతరులను పట్ల సోదర భావంతో వుండా లని, క్రమశిక్షణను కలిగి వుండాలని చెప్పారు.ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల సంప్రదాయ రంగులు ఆనందంగా అద్దుకున్నారు.ఈ కార్యక్రమంలో టీచర్లు అమరేశవరి, షఫియ, సంధ్య, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి నరసింహారెడ్డిని గెలిపించండి



విశాలాంధ్ర - పామూరు : ఐదు సంవత్సరముల వైసీపీ పాలనలో కనిగిరి నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలుగు యువత మండల నాయకులు పట్టణ పంచాయితీ వార్డు మెంబర్ ఉప్పలపాటి హరి బాబు అన్నారు. శనివారం దేవాలయం వీధిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు జరిపే సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో కనిగిరి అభివృద్ధి ప్రదాత మాజీ శాసనసభ్యులు, టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ్ల నారాయణ, సుంకే వెంకటస్వామి పాల్గొన్నారు.

భగత్ సింగ్ యువతకు ఆదర్శనీయుడు

విశాలాంధ్ర - పామూరు : భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువత ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నారు. శనివారం 93వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ స్ట్రీట్ లోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. హౌలాలి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులో ఉరితాడును ముద్దాడిన విప్లవ వీర కిశోరం సర్దార్ భగత్ సింగ్ అన్నారు. భారతరత్న అవార్డు ఇవ్వాలని, అలాగే భగత్ సింగ్ జయంతి ,వర్ధంతిలను అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి సుబ్బారావు మండల కార్యదర్శి ప్రభాకర్, ఎస్‌కేరఫీ, సీపీఐ నాయకులు రఘునాథరెడ్డి, మోహనారావు, ప్రసాదు, సూరిబాబు, మహేష్ పాల్గొన్నారు.

ఉగ్ర నరసింహారెడ్డిని కలిసిన వెంకట్

విశాలాంధ్ర - హనుమంతునిపాడు : మండలంలోని ఉన్న మహమ్మదాపురానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్‌వ్యాపారి కూరాకు వెంకట్, మహమ్మదాపురం గ్రామ నాయకులందరూ కలసి కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని విజయవాడలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా శాలవాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, దొడ్డ బాలకృష్ణారెడ్డి, సైకం కాశిరెడ్డి, కొండపురెడ్డి నాగిరెడ్డి మరియు తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

మహనీయుని ఆశయాలే స్ఫూర్తి

నేటి యువతకు రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర - మార్కాపురం : స్థానిక పూల సుబ్బయ్య భవన్‌లో శనివారం సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో పాల్గొని కేవలం 23 సంవత్సరాలకే దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు సర్దార్ భగత్ సింగ్ అని దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ నిజమైన దేశభక్తులని అటువంటి దేశభక్తులు జీవితాల గురించి తెలుసుకొని వారి స్ఫూర్తితో నేటి యువత, విద్యార్థులు పోరాటాల్లో ముందుకు రావాలని ఆయన కోరారు. జాతీయ వాదం పేరుతో యువతను విద్యార్థులను పక్కదో పట్టిస్తున్న దేశద్రోహుల వుతున్నారని, ఇలాంటి శక్తులకు భారతదేశ లౌకికవాదంలో మనుగడ ఉండకూడదని ఆయన కోరారు. సీపీఐ నాయకులు అందె నాసరయ్య, జిల్లా ఏఐటీయూసీ ఎస్‌కె కాసిం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అండగా ఉంటా..

కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల

విశాలాంధ్ర - పామూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి వైసీపీ అభ్యర్థిగా నిలిచానని ఆదరించి ఆశీర్వదిస్తే అండగా నిలుస్తానని కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని తూర్పు వీధిలో ఎన్నికల ప్రచారాన్ని దర్గా నారాయణ ప్రారంభించారు. ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని జగన్మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని దీవించి గెలిపించాలని కోరారు. వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు పట్టణ ఉప సర్పంచ్ వేదాల వెంకట సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా, మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, రెండవ వార్డ్ మెంబర్, ఇర్రి కృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు చల్లా సుబ్బారావు, కొత్తూరు రవి,ఓగురి ఏడుకొండలు, దేవళ్ళ గురుస్వామి, తుపాకుల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి 'బోగాది రవిచంద్ర'

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరుకు చెందిన జనసేన నాయకులు బోగాది రవిచంద్ర తన అనుచరులతో కలిసి వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ సమక్షం లో వైసీపీలో చేరారు. రవిచం ద్రకు బాలాజీ పార్టీ కండవా కప్పి పార్టీలోకి శనివారం ఆహ్వానించారు. వైసీపీ విజయానికి కృషిచేస్తానని బోగాది తెలిపారు. వీరివెంట పార్టీనాయకులు కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాస రావు, లంకా శివ, తులసి శివనాగేశ్వరరావు, పూర్ణ, గాదె సురేష్, దాసరి వెంకటరావు, తదితరులు ఉన్నారు.

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ముండ్లమూరు : భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయులని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య అన్నారు. మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో శనివారం భగత్ సింగ్ 93వ వర్ధంతినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఉద్యమించి బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ దేశం కోసం ప్రాణాలర్పించారని, ఫలితంగా ఏర్పడిన స్వాతంత్ర ఫలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కళ్యాణ్, షేక్ బాషా, నన్నా, మోహిత్, హమీద్, నాగూర్, అమీన్ భాష, కిరణ్ పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - ఒంగోలు : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుసరించి త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి ఈవీయంలు, వీవీ పాట్స్ భద్రపరిచిన గోదాము సీల్స్‌ను, ఎలక్ట్రానిక్ ఓటింగ్‌కు సంబంధించిన వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌లతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇవియం ప్రాంగణంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన సూచనలను సంబంధిత అధికారులకు, సిబ్బందికి జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటి కప్పుడు ఈవీఎం, వివిప్యాట్ గోడౌన్ సీల్స్‌ను, సీసీటీవీల పని తీరు, భద్రతా ఏర్పాట్లను, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను క్షుణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఒకే సారి పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎన్నికలు జరుగుచున్నందున అవసరమైన వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్ వారి వెంట వైసీపీ ప్రతినిధి క్రాంతి కుమార్, బీజేపీ ప్రతినిధి రాజశేఖర్, టీడీపీ ప్రతినిధి ఎం. కాలేషా భేగ్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రసూల్ బాషా, సీపీఎం పార్టీ ప్రతినిధి ఎస్.డి అనీఫ్, బీఎస్పీ ప్రతినిధి డి. ఎర్రయ్య, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా కాలువ నిర్మించారు

విశాలాంధ్ర - టంగుటూరు : స్థానిక టంగుటూరు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆలకూర పాడు గ్రామానికి చెందిన వాకా వెంకటేశ్వరరెడ్డి శనివారం పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలకూర పాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నానని, మా తండ్రి వాకా కోటిరెడ్డి వద్ద నుండి వారసత్వంగా నాకు సర్వే నంబర్ 187లో మూడు ఎకరాల పాతిక సెంట్లు సంక్రమించిందని అన్నారు. అందులో 20 సంవత్సరాల నుంచి రొయ్యల చెరువు సాగు చేస్తున్నామని, నా చెరువు పక్కనే ఉన్న మా గ్రామానికే చెందిన పమిడి చిన్న సుబ్బానాయుడు అక్రమంగా నా చెరువు కట్ట త్రవ్వి డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేశారన్నారు. నేను సర్వేయర్‌కు కొలతల కొరకు అర్జీ పెట్టుకుంటే శనివారం సర్వేయర్ వచ్చి కొలతలు కొలుస్తూ ఉండగా పమిడి సుబ్బానాయుడు 20 మందితో అక్కడకు వచ్చి సర్వే యర్ విధులకు ఆటంకం కలిగిస్తూ నాపై ఘోరంగా దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశారని వాపోయారు. సర్వేయర్ని కూడా లెక్కచేయకుండా నేను రాయి నాటుతా దమ్ముంటే ఆపు అంటూ రాయిపాతి భయభ్రాంతులకు గురి చేశాడు. ఇది ఎక్కడ న్యాయమని నేను అడిగితే మీదకు వస్తు నీకు దిక్కున చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని ఒక వెంకటేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాకు జరిగిన అన్యాయం పట్ల సత్వరమే అధికారులు స్పందించి నాకు రక్షణ కల్పిస్తూ న్యాయం చేయవలసిందిగా వేడుకుంటున్నానని వాపోయారు.

మతోన్మాద దాడులను నేటి యువత తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - ఒంగోలు : నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూ సన్యాల్, జాతీయోద్యమ ధృవతార కామ్రేడ్ భగత్‌సింగ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఈమని పాలెంలో సీపీఐ ఎంఎల్ ప్రకాశం జిల్లా కమిటీ సభ నిర్వహించింది. ఈ సభకి ఏఐఎఫ్టీయూ (న్యూ) జిల్లా నాయకులు కామ్రేడ్ విజయ సారథి అధ్యక్షత వహించారు. భారతదేశ దేశాన్ని సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడి నుంచి విముక్తి చేయడం కోసం జీవితాంతం తపించి, తమ జీవితాలను అందుకోసం త్యాగం చేసిన అమరవీరులని కామ్రేడ్ కానుసన్యాల్, కామ్రేడ్ భగత్ సింగ్‌లను సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివిఎన్ స్వామి కొనియాడారు. వారు చూపిన మార్గాన్ని అనుసరించి సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించుకోగలమని ఆయన స్పష్టం చేశారు. నక్సల్బరీ ఉద్యమ నిర్మాత అయిన కామ్రేడ్ కాను సన్యాల్, విప్లవోద్యమంలోని అతివాద, మితవాద పంథాలకు వ్యతిరేకంగా పోరాడి, భారత విప్లవోద్యమాన్ని సరైన మార్గంలో నిలబెట్టేందుకు తన జీవితాన్ని ధారపోశారని ఆయన అన్నారు. అనంతరం మాట్లాడిన ఏఐఎఫ్టీయూ (న్యూ) జిల్లా నాయకులు కామ్రేడ్ ఎంఎస్‌సాయి మాట్లాడుతూ మతోన్మాదం నుంచి ఎదుర్కొంటున్న దాడులను తిప్పి కొట్టడానికి వారి ఆచరణను నేటి యువతరం తమ కర్తవ్యంగా స్వీకరించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.)జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్ లలిత కుమారి మాట్లాడుతూ ఇలాంటి అమరవీరుల స్ఫూర్తిని అవమానించేలా, వారి ఆశయాలకు వ్యతిరేకంగా నేటి పాలకుల విధానాలు కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శింగరకొండ తిరునాళ్ళకు పటిష్ట బందోబస్తు

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - అద్దంకి ; సింగరకొండ తిరునాళ్ళకు 750మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. ఈనెల 25న జరగనున్న సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి 69వ వార్షిక తిరునాళ్ళను పురస్కరించుకొని శనివారం అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ దేవాలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికా బద్దంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ముందుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ప్రభల కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున దానికి లోబడి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఇతరులను కించపరచే విధంగా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. రాజకీయపార్టీల జెండాలు కానీ, గుర్తులు కానీ, అసభ్యకరమైన నృత్య ప్రదర్శనలు ప్రభల వద్ద నిర్వహించరాదన్నారు. ఎన్నికల నియ మావళిని ఎవరైనా ఉల్లంఘించిన,శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినా చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం భవానీ సెంటర్,సింగరకొండ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ డైవర్షన్లను ,పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్దంగా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. తిరునాళ్ళకు రెండు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సుమారు 750మంది పోలీస్ అధికా రులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రశాంతంగా తిరునాళ్ళ జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ అధికారులకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ సూచించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.